# క్రైమ్ కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 76 ఆదివారం 14-12-2025 పేజీలు : 4 వెల : 4/-

Website:- https://www.crimecounter.in/



క్రైమ్ కౌంటర్ News
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలంగాణ సూర్యాపేట్ జిల్లా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

రిపోర్టర్లు కావలెను

- జిల్లా బ్యూరోలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


## హైదరాబాద్‌లో దక్షిణాసియాలోనే అతి ఎత్తైన భవనం..

# ఏకంగా 72 అంతస్తుల్లో



హైదరాబాద్ ఇక విశ్వనగరంగా మారుతోంది. ఘట్‌కేసర్ ప్రాంతంలో 72 అంతస్తుల భారీ భవనం రాబోతోంది. ఇది దక్షిణాసియాలోనే అతి పెద్ద భవనంగా నిలవనుంది. డాన్సింగ్ డెఫోడైల్ థీమ్‌తో, గాలిలో మెలికలు తిరుగుతున్నట్టుగా కనిపించే ఈ భవనం, అగ్నిప్రమాద నివారణకు పటిష్ఠమైన చర్యలతో నిర్మించబడుతోంది అని రాష్ట్ర ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ డీజీ తెలిపారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో ఇది ఒక సంచలనం కానుందని అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందుతుంది. నగరంలో అనేక దిగ్గజ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు కొలువుదీరాయి. నాలుగు రోజుల క్రితం తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. ఇక నగరంలో రియల్ ఎస్టేట్ అభివృద్ధి గురించి ఎంత చెప్పినా తక్కువే. భారీ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో నగరంలో అతి పెద్ద బిల్డింగ్ నిర్మించబోతున్నారని సమాచారం. ఈ భవనం దక్షిణాసియాలోనే అతి పెద్ద బిల్డింగ్‌గా నిలవబోతుంది అంటున్నారు. హైదరాబాద్ నగరంలో దేశంలోనే కాదు.. దక్షిణాసియాలోనే అతి పెద్ద భవనాన్ని నిర్మించబోతున్నారని సమాచారం. హైదరాబాద్ నగర శివారులోని.. ఘట్‌కేసర్ ప్రాంతంలో 72 అంతస్తుల ఎత్తైన భవనాన్ని నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఈ ఎత్తైన బిల్డింగ్నిర్మాణ అనుమతుల కోసం ఓ నిర్మాణ సంస్థ.. ఇప్పటికే అగ్నిమాపక శాఖను సంప్రదించిందని తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ డీజీ తెలిపారు. హైటెక్‌సిటీలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన 'ఫైర్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో త్వరలోనే నిర్మించబోయే భారీ ప్రాజెక్టుల వివరాలు వెల్లడిస్తూ.. ఈ బిల్డింగ్ గురించి ప్రస్తావించారు. ఈ నిర్మాణం పూర్తయితే దక్షిణాసియాలో ఇదే ఎత్తైన భవనంగా రికార్డు క్రియేట్ చేయనుంది అని తెలిపారు. ఈ బిల్డింగ్‌ని నిర్మించబోయే నిర్మాణదారులు.. ఈ భవనంలో ప్రతి 30 అంతస్తులకు నిర్మాణాన్ని మారుస్తారని తెలిపారు. ఈ బిల్డింగ్‌ని 'డాన్సింగ్ డెఫోడైల్' థీమ్‌తో నిర్మిస్తున్నారని వెల్లడించారు. దూరం నుంచి ఈ బిల్డింగ్‌ని చూస్తే.. ఈ భవనం స్థిరంగా కాకుండా, గాలిలో మెలికలు తిరుగుతున్నట్టుగా భ్రమ కలిగిస్తుందన్నారు. ఈ భారీ భవనంలో అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించిన పటిష్ఠమైన చర్యలను ప్లాన్‌లో పొందుపరిచినట్లు తెలుస్తోంది. ఇక తాజాగా శుక్రవారం నాడు హైదరాబాద్‌లో అతి పెద్ద మాల్ లేక్ షోర్ ప్రారంభించారు. గతంలో లూలూ మాల్ ప్రారంభంలో ఎలాంటి రద్దీని చూశారో.. నిన్న కూడా అదే మాదిరి జనాలు ఎగబడ్డారు. అందుకు ప్రధాన కారణం మొదటి వెయ్యి మందికి ఫ్రీ కూపన్లు, ఓచర్లు ఇస్తామని ప్రకటించారు. దీంతో జనాలు భారీగా ఎగబడ్డారు.

## నన్ను ఆదరించి ఆశీర్వదించండి.అభివృద్ధి చేస్తా.

కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రమ నర్సిరెడ్డి.




క్రైమ్ కౌంటర్ న్యూస్. కోదాడ, అడ్లూరు. డిసెంబర్ 13 ( గురునాథం జిల్లా బ్యూరో ) మండల పరిధిలోని అడ్లూరు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పింగళి రమ నర్సిరెడ్డి గుర్తు కత్తెర గుర్తుపై గ్రామ ప్రజలు ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ప్రజలను అభ్యర్థించారు. ముఖ్యంగా గ్రామములో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని వీధిలైట్లు, గ్రామ పరిశుభ్రత, డ్రైనేజీ, వ్యవస్థను లాంటి సమస్యలను పరిష్కరించేందుకు పాలకవర్గంతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి, స్థానిక శాసన సభ్యురాలు నలమాద పద్మావతి రెడ్డి పూర్తి సహాయ సహకారాలతో పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని గ్రామములో పెద్దల, దాతల సహకారంతో రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించటం జరిగిందని ఆయన గుర్తు చేశారు. త్వరలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించుకుందాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజినెస్ చేయాలనే ఆలోచన ఉందా..?




తెలంగాణ డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య రాబోయే నాలుగేళ్లలో 400 నుంచి 500 కొత్త విజయ డెయిరీ పార్లర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విస్తరణలో భాగంగా.. ఆసక్తిగల ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఫ్రాంచైజ్ అవకాశం కల్పిస్తోంది. ఒక పార్లర్ ప్రారంభించడానికి సుమారు రూ. 1 లక్ష నుంచి 5 లక్షల వరకు పెట్టుబడి అవసరం అవుతుంది. నిర్వహణ, అమ్మకాలు బాగా ఉంటే లక్షల్లో ఆదాయం పొందవచ్చు. ప్రస్తుతం 4 లక్షల లీటర్ల పాల సేకరణను 6 లక్షల లీటర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ , తన విజయ డెయిరీ నెట్‌వర్క్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు సిద్ధమవుతోంది. రాబోయే మూడు నుంచి నాలుగు సంవత్సరాలలో అదనంగా 400 నుంచి 500 కొత్త పార్లర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు టీడీడీసీఎఫ్ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ప్రకటించారు. ఇది డెయిరీ రంగంలోకి ప్రవేశించాలనుకునే కొత్త ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఒక అద్భుతమైన అవకాశంగా నిలుస్తోంది.విజయ డెయిరీ తమ ఉత్పత్తులను విస్తృతం చేయడానికి ఫ్రాంఛైజ్ విధానంలో పార్లర్లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగల వ్యక్తులను ఆహ్వానిస్తోంది. విజయ డెయిరీ పార్లర్‌ను ప్రారంభించడానికి సుమారు రూ. 1 లక్ష నుంచి 5 లక్షల వరకు పెట్టుబడి అవసరం అవుతుందని సమాచారం. ఈ పెట్టుబడి స్థలం, పరికరాలు (ఫ్రిడ్జ్‌లు, కూలర్‌లు), ఫ్రాంచైజ్ ఫీజు వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది. పార్లర్ నిర్వహణ, లొకేషన్, అమ్మకాలు బాగా జరిగితే.. లక్షల్లో సంపాదించే అవకాశం ఉంటుంది. ఫ్రాంఛైజీ తీసుకోవడం వల్ల బ్రాండ్ గుర్తింపు ఉండటం వలన, వ్యాపారం త్వరగా వృద్ధి చెందే అవకాశం ఉంది.ఎలా ప్రారంభించాలి.. ?విజయ డెయిరీ ప్రధాన కార్యాలయాన్ని లేదా వారి అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించి, ఫ్రాంచైజ్ అవకాశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. పార్లర్ ఏర్పాటుకు అవసరమైన స్థలం, పెట్టుబడి, ఇతర నిర్వహణ అవసరాల గురించి పూర్తి వివరాలను సమాఖ్య అధికారుల నుంచి తెలుసుకోవాలి.ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో 50, గ్రామీణ ప్రాంతాల్లో 25 కొత్త పార్లర్‌లను ఇప్పటికే ప్రారంభించారు. నెలకు సుమారు 25 పార్లర్లను ప్రారంభించే లక్ష్యంతో ఈ విస్తరణ కొనసాగుతోంది. ప్రస్తుతం రోజుకు సుమారు 4 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్న సమాఖ్య.. దీనిని 6 లక్షల లీటర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతిరోజూ సుమారు 4.40 లక్షల లీటర్ల పాలు సేకరిస్తుండగా.. అమ్మకాలు 3.20 లక్షల లీటర్లు మాత్రమే ఉన్నాయి. మిగులు పాలను పాలు పౌడర్, వెన్న, ఐస్ క్రీం వంటి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా ఆదాయాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు.పాల ఉత్పత్తికి ప్రభుత్వ మద్దతు..నేషనల్ మిల్క్ డే 2025 సందర్భంగా జరిగిన సదస్సులో. రాష్ట్రంలో పాల ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఛైర్మన్ అమిత్ రెడ్డి తెలిపారు. పశుపోషణ, నిర్వహణలో ఏఐ , ఈఆర్పీ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగిస్తున్నామని చెప్పారు. రైతులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఖచ్చితమైన పాల ధర, సకాలంలో చెల్లింపులు అవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు.

## బిక్షాటన చేస్తున్నా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, డిసెంబర్ 13( గురునాథం జిల్లా బ్యూరో )సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య అన్నారు. ముస్లింలకు పవిత్రమైన రోజు అయిన శుక్రవారం నాడు చలిలో వణుకుతూ మసీదుల వద్ద బిక్షాటన చేస్తున్న వృద్ధులకు, అనాథలకు దుప్పట్లను ను పంపిణీ చేశారు. సమాజంలో నిరక్షరాస్యులు, నిరుపేదలకు సహాయ, సహకారాలు అందిస్తూ అండగా నిలవాలని సంఘ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బాలేమియా, యస్ దాని, హసన్ జానీ, తిరుపతమ్మ, వీరబాబు, రాంబాబు, హుస్సేన్, శ్రీనివాసరావు, భ్రమరాంబ, రఘు తదితరులు పాల్గొన్నారు.

## గుండె ఆగిన వారికి సీపీఆర్ రక్ష



డా. అభిరామ్ స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సిపిఆర్ పై అవగాహన

క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, డిసెంబర్ 13( గురునాథం జిల్లా బ్యూరో)అత్యవసర వైద్య సేవల్లో ముఖ్యంగా గుండె ఆగిపోయిన వ్యక్తికి మళ్లీ ప్రాణం పోసే శక్తి కేవలం సీపీఆర్‌కే ఉందని డాక్టర్ అభిరామ్ తెలిపారు. శనివారం కోదాడ పట్టణంలో స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సిపిఆర్ పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ శ్వాస ఆగినప్పుడు వెంటనే స్పందించి సీపీఆర్ చేస్తే మృత్యు అంచుకు వెళ్లిన వ్యక్తిని తిరిగి తీసుకురావచ్చని అన్నారు. సిపిఆర్ ఏ విధంగా చేయాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. స్వర్ణ భారతి ట్రస్ట్ చేస్తున్న సామాజిక సేవలను ఆయన అభినందించారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల ప్రవీణ, రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సమన్వయకర్తలు వెంపటి వెంకట రమణ, ఓరుగంటి ప్రభాకర్ సభ్యులు చిట్టిప్రోలు నారాయణ, కందిబండ నాగేశ్వర రావు, అర్వపల్లి హన్మంతరావు తదితర ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే గ్రామాభివృద్ధి చేసి చూపెడతా




ఆకు పాముల గ్రామపంచాయతీ ఎన్నికల్లో బ్యాట్ గుర్తుకే ఓటేసి గెలిపించాలని ప్రార్థన.

క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, ఆకుపాముల. డిసెంబర్ 13( గురునాథం జిల్లా బ్యూరో)కాంగ్రెస్ పార్టీ బలపరిచిన గ్రామపంచాయతీ సర్పంచిగా నన్ను ఎన్నుకుంటే గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి విలాస కవి వసుంధర రమేష్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామములో ఉన్న విద్యావంతులు మేధావులు రైతులు ఆలోచించి తమ అమూల్యమైన ఓటు బ్యాట్ గుర్తుపై వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరినారు. నీటిపారుదల శాఖ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్థానిక శాసన సభ్యురాలు పద్మావతి రెడ్డి పూర్తి సహాయ సహకారాలతో పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో నెలకొని ఉన్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు తన గుర్తు బ్యాట్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కేశగాని వెంకటేశ్వర్లు, సునికి జై చంద్ర రెడ్డి, పొలం పల్లి వెంకటేశ్వర్లు, పోలంపల్లి వీరబాబు, నారాయణ, నాగేశ్వరరావు, నారాయణ చింతల శ్రీనివాస్, జిల్లా వెంకటేశ్వర్లు, సైదులు తాళ్లపాక అర్జున్ తదితరుల పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో ఇంటి కోసం అప్లయ్ చేసుకున్నారా..?




ఆదిలాబాద్ జిల్లాలో ప్రతిష్టాత్మక రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు ప్రక్రియలో అనూహ్య సమస్య ఎదురైంది. లక్కీ డ్రాలో ఎంపికైన 618 మంది లబ్ధిదారులలో 176 మందిని సంప్రదించలేకపోవడంతో..వారి స్థానంలో కొత్త అర్హులకు ఇళ్ల కేటాయింపునకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతిష్టాత్మకమైన రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ఆదిలాబాద్ జిల్లాలో కొలిక్కి వస్తోంది. గతంలో నిర్వహించిన లక్కీ డ్రాలో ఎంపికైన లబ్ధిదారులతో పాటు, ఇటీవల ప్రారంభించిన ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న అర్హులను గుర్తించి, ఇంటి కేటాయింపు కోసం అధికారులు తుది జాబితాను సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ ప్రక్రియలో అనూహ్యమైన సమస్య ఎదురైంది. గతంలో లక్కీ డ్రా ద్వారా ఎంపికైన మొత్తం 618 మంది లబ్ధిదారుల స్థితిగతులపై సర్వే నిర్వహించాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించింది. ఈ సర్వేను క్షేత్రస్థాయిలో నిర్వహించడానికి వార్డు అధికారులు ప్రయత్నించగా.. వారిలో 176 మంది లబ్ధిదారులు ఇప్పటిదాకా అందుబాటులోకి రాలేదు. రెండున్నరేళ్ల కిందట దరఖాస్తులో ఇచ్చిన చిరునామాలు దొరకకపోవడం, ఫోన్ నెంబర్లు పనిచేయకపోవడం, కొందరు చనిపోవడం, మరికొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోవడం వంటి కారణాల వల్ల ఈ లబ్ధిదారుల వివరాలు అధికారులకు లభ్యం కావడం లేదు. దీంతో వార్డు అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు. ఆదిలాబాద్ బల్దియా పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం రెండు ప్రధాన ప్రాంతాలను ఎంచుకున్నారు. 170 కాలనీలో 222 గృహాలను (రూ.11.76 కోట్లతో) కేఆర్‌కే కాలనీలో 760 ఇళ్లతో సహా మొత్తం 982 గృహ సముదాయాలను (రూ.40.28 కోట్లతో) జీ ప్లస్-2 తరహాలో నిర్మించారు. ఈ ఇళ్లు నిర్మించి అయిదేళ్లకు పైగా అయినప్పటికీ కనీస మౌలిక వసతులు రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు కల్పించడంలో జాప్యం జరగడంతో ఇవి నిరుపయోగంగా ఉన్నాయి. లబ్ధిదారులు ఇళ్లపై అనాసక్తి చూపడానికి ఇదే ప్రధాన కారణం. అపార్ట్‌మెంట్ తరహా నివాసాల కంటే కొందరు లబ్ధిదారులు తమ సొంత స్థలాల్లో కొత్త ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. 2023 మే నెలలో నిర్వహించిన లక్కీ డ్రాలో మొత్తం 982 ఇళ్లలో 618 ఇళ్లకు మాత్రమే లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇప్పుడు.. సర్వేకు అందని 176 మంది లబ్ధిదారుల స్థానంలో ప్రజాపాలన దరఖాస్తుదారులు సహా ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఈ ఇళ్లను కేటాయించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు అందగానే ఖాళీగా ఉన్న ఇళ్ల కేటాయింపును వేగవంతం చేసే అవకాశం ఉంది, తద్వారా నిరుపేదలకు సొంతింటి కల సాకారమవుతుందని భావిస్తున్నారు.

## శుభవార్త చెప్తారనుకుంటే..



కొత్త జీవితంపై ఎన్నో ఆశలతో పెళ్లయిన ఓ నవ వధువు, మూడు నెలల్లోనే ఆత్మహత్య చేసుకుని కలకలం రేపింది. భార్యాభర్తల మధ్య నిత్యం గొడవలే కారణమని తెలుస్తోంది. హైదరాబాద్ మూసాపేటలో జరిగిన ఈ విషాద ఘటన స్థానికంగా కలకలం రేపుతుంది. భర్తతో కలిసి సంతోషంగా బతుకుతుందని భావించిన కుమార్తె ఇలా పెళ్లైన మూడు నెలలకే ఆత్మహత్య చేసుకోవడం ఆ తల్లిదండ్రులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. కుమార్తె మరణం వారికి తీరని దుఖాన్ని మిగిల్చింది. వారిద్దరూ ఎన్నో ఆశలతో వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. కొత్త జీవితం గురించి కోటి కలలు కన్నారు. కానీ పెళ్లి తర్వాత వారి ఆశలు, కలలు కల్లలయ్యాయి. అభిప్రాయభేదాలో లేక మరే ఇతర కారణమో తెలియదు కానీ.. పెళ్లైన నాటి నుంచి భార్యాభర్తలిద్దరి మధ్య తరచుగా గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఎంతో సంతోషంగా సాగుతుందనుకున్న వైవాహిక జీవితం.. నిత్యం గొడవలతో నరకంగా మారడంతో.. తీవ్ర మనస్తాపానికి గురైన నవ వధువు దారుణానికి ఒడిగట్టింది. పెళ్లైన మూడు నెలలకే ఓ నవ వధువు ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటన హైదరాబాద్, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మూసాపేట్‌లో వెలుగు చూసింది. పెళ్లైన నాటి నుంచి నిత్యం గొడవలు జరుగుతుండటంతో.. ఇలాంటి దారుణ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్, ప్రొద్దుటూరుకు చెందిన చందన జ్యోతి అనే యువతికి.. మూడు నెలల క్రితం వివాహం అయ్యింది. కొత్తగూడెంకు చెందిన యశ్వంత్‌తో ఆమె వివాహం జరిగింది. యశ్వంత్.. ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లయిన తర్వాత వీరిద్దరూ సిటీలోని.. మూసాపేట్‌లో నివసిస్తున్నారు. ఎంతో అన్యోన్యంగా, సంతోషంగా జీవించాల్సిన ఈ నూతన జంట.. నిత్యం గొడవలు పడుతుండేవారు. ఈ క్రమంలో తాజాగా శుక్రవారం కూడా వీరి మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చందన జ్యోతి.. బెడ్‌రూమ్‌లోకి వెళ్లి.. తలుపులు వేసుకుని.. ఆత్మహత్యకు పాల్పడింది. గదిలోకి వెళ్లిన చందన జ్యోతి ఎంత సేపటికీ తలుపు తీయకపోవడంతో.. అనుమానం వచ్చిన యశ్వంత్.. తలుపులు బద్దలు కొట్టి చూడగా... అపస్మారక స్థితిలో కనిపించింది. అది గమనించిన యశ్వంత్ వెంటనే 108కు కాల్ చేశాడు. అంబులెన్స్ రాగానే చందనను దానిలో ఎక్కించి స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చందనను పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మరణించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. చందన మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఎన్నో ఆశలతో కుమార్తెకి పెళ్లి చేశాము.. తను పండంటి బిడ్డలను కని.. భర్తతో కలిసి సంతోషంగా ఉంటుందని భావిస్తే.. ఇలా అర్థాంతరంగా చనిపోయి తమకు తీరని దు'ఖాన్ని మిగిల్చిందంటూ చందన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## సర్పంచ్ ఎన్నికల బరిలో ఎంబీబీఎస్ విద్యార్థిని..




తెలంగాణలో రెండో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ రేపు (ఆదివారం) జరగనుంది. మొత్తం 4,332 పంచాయతీలకు గాను.. 415 స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 3,911 పంచాయతీలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. వికారాబాద్ జిల్లా, దొంగ ఎన్కేపల్లి గ్రామంలో ఎంబీబీఎస్ విద్యార్థిని శ్రీయ రెడ్డి సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నారు. ప్రజా సేవ లక్ష్యంగా.. యువతకు స్వయం ఉపాధి కల్పించే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చానని ఆమె తెలిపారు. పట్టణాల నుంచి ఓటర్లు స్వగ్రామాలకు తరలిరావడంతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడ్డాయి. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల హవా కొనసాగుతోంది. రాష్ట్రంలో రెండో విడత ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో.. రాజకీయాలపై యువత ఆసక్తి చూపుతూ ఎన్నికల బరిలోకి దిగుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. వికారాబాద్ జిల్లాలో ఎంబీబీఎస్ విద్యార్థిని సర్పంచ్ పదవికి పోటీ చేయడం యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. వికారాబాద్ జిల్లా, దోమ మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లి గ్రామంలో ఈ నెల 17న జరగనున్న సర్పంచ్ ఎన్నికల బరిలో ఎంబీబీఎస్ విద్యార్థిని శ్రీయ రెడ్డి పోటీ పడుతున్నారు. సమాజ సేవ సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో పోటీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామంలోని యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనేది తన ప్రధాన లక్ష్యమని శ్రీయ స్పష్టం చేశారు. గ్రామ ప్రజలకు అవసరమైన వైద్య సహాయాన్ని అందించేందుకు.. కార్పొరేట్ ఆసుపత్రులలో తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తమ కుటుంబీకులు పదవులతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ పేద ప్రజల కోసం సేవ చేస్తూనే ఉన్నారని.. నిరుపేదలకు సహాయం చేయడానికి ముందుంటామని ఆమె పేర్కొన్నారు. తెలంగాణలో ఆదివారం (రేపు) రెండో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. దీని కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 4,332 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే.. 415 గ్రామాల్లో సర్పంచ్ పదవులు ఏకగ్రీవం అయ్యాయి. మరో 5 చోట్ల నామినేషన్లు లేకపోవడంతో అక్కడ ఎన్నికలు జరగడం లేదు. ఏకగ్రీవాలు కాకుండా.. మిగిలిన 3,911 పంచాయతీలకు సర్పంచులు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. అధికారులు ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. రెండో దశ పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి పట్టణాలలో నివసిస్తున్న ప్రజలు తమ స్వగ్రామాలకు పెద్ద ఎత్తున బయలుదేరారు. దీంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ లు ఏర్పడ్డాయి. ప్రజలు ఉత్సాహంగా తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవడానికి సిద్ధమయ్యారు. శ్రీయ రెడ్డి వంటి చదువుకున్న యువత..

## తెలంగాణలో 105 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణం..




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. 'విద్యార్థులకు నాణ్యమైన విద్య' లక్ష్యంగా, రూ. 21,000 కోట్ల పెట్టుబడితో 105 నియోజకవర్గాల్లో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'ను ఏర్పాటు చేస్తున్నారు. ఇది కులమత భేదం లేకుండా అందరికీ ఒకే క్యాంపస్‌లో విద్యను అందిస్తుంది. 10 వేల టీచర్ పోస్టుల భర్తీ, ఉచిత విద్యుత్, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి చర్యలతో విద్యారంగానికి బలమైన పునాది పడుతోందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులకు శ్రీకారం చుట్టిందని.. కాలానుగుణంగా మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యారంగానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ.. గత రెండు సంవత్సరాలుగా 'విద్యార్థులకు నాణ్యమైన విద్య' అనే లక్ష్యంతో ప్రభుత్వం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని ఆయన తెలిపారు. శనివారం నాడు హైటెక్స్‌లో బ్రెయిన్ ఫీడ్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈటీ టెక్ ఎక్స్ 6వ ఎడిషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ఈ విషయాలు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో తీసుకున్న అత్యంత ప్రతిష్టాత్మక నిర్ణయాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు ఒకటి. కుల, మత భేదాలు లేకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ (రాజ, రా, దీజ, వీఅఅశీతీఓఎ) విద్యార్థులందరూ ఒకే క్యాంపస్‌లో అన్ని సౌకర్యాలతో కలిసి చదువుకునేలా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణానికి ప్రభుత్వం ఏకంగా రూ. 21,000 కోట్ల భారీ పెట్టుబడిని కేటాయించింది. ప్రతి పాఠశాలను 25 ఎకరాల విశాల ప్రాంగణంలో.. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో ఏర్పాటు చేయనున్నారు. విద్యారంగంలో మార్పులతో పాటు, ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో... 2024 డీఎస్సీ ద్వారా పది వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగింది. 2024 సెప్టెంబర్ నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని అమలు చేస్తున్నారు. దీనికోసం ప్రభుత్వం సంవత్సరానికి సుమారు రూ. 140 కోట్ల వ్యయాన్ని భరిస్తోంది.

## మెస్సీ టీమ్ మీద సింగరేణి ఆర్‌ఆర్ జట్టు విజయం..

సాకర్ స్టార్ లియోనాల్ మెస్సీ హైదరాబాద్‌లో సందడి చేశారు. ఉప్పల్ వేదికగా జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో పాల్గొన్నారు. అపర్ణ మెస్సీ టీమ్, సింగరేణి ఆర్‌ఆర్ టీమ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సింగరేణి జట్టు గెలుపొందింది. సింగరేణి ఆర్‌ఆర్ జట్టు తరుపున సీఎం రేవంత్ రెడ్డి బరిలోకి దిగి గోల్ సాధించడం విశేషం. మ్యాచ్ అనంతరం విజేతకు మెస్సీ ట్రోఫీని బహూకరించారు. ఈ మ్యాచ్ చూడటానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు. ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఫ్రెండ్లీ ఫుట్ బాల్ మ్యాచ్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సింగరేణి ఆర్‌ఆర్ జట్టు విజయం సాధించింది. సింగరేణి ఆర్‌ఆర్ జట్టు తరుపున సీఎం రేవంత్ రెడ్డి.. అపర్ణ మెస్సీ ఆల్ స్టార్స్ నుంచి ఫుట్‌బాల్ దిగ్గజం లియోనాల్ మెస్సీ గ్రౌండ్‌లోకి దిగడం అభిమానులను ఉర్రూతలూగించింది. శనివారం రాత్రి 8 గంటలకు ప్రారంభమైన ఈ ఫుట్ బాల్ మ్యాచ్‌లో.. ప్రారంభంలోనే సింగరేణి ఆర్‌ఆర్ జట్టు వరుసగా రెండు గోల్స్ సాధించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా గ్రౌండ్లోకి దిగడమే కాకుండా.. ఒక గోల్ సాధించి మ్యాచ్ చూడటానికి వచ్చిన వారికి మజాను పంచారు. మ్యాచ్ 18వ నిమిషంలో గ్రౌండ్ లో అడుగుపెట్టిన రేవంత్ రెడ్డి వచ్చీ రావటంతోనే గోల్ కొట్టి అలరించారు. దీంతో అభిమానుల కేరింతలతో ఉప్పల్ స్టేడియం మార్మోగింది. ఆ తర్వాత లియోనాల్ మెస్సీ కూడా గ్రౌండ్లోకి దిగి సీఎం రేవంత్ రెడ్డితో కలిసి సరదాగా కాసేపు ఫుట్ బాల్ ఆడారు. మ్యాచ్ పూర్తైన తర్వాత సింగరేణి ఆర్‌ఆర్ జట్టుకు మెస్సీ ట్రోఫీని అందజేశారు. అలాగే అపర్ణ మెస్సీ ఆల్ స్టార్స్ జట్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్రోఫీని అందించారు. మ్యాచ్ సందర్భంగా మెస్సీ, రోడ్రిగో, సీఎం రేవంత్ రెడ్డి స్టేడియంలో చుట్టూ తిరుగుతూ ప్రేక్షకులకు అభివాదం చేశారు. మరోవైపు తమ అభిమాన క్రీడాకారుణ్ని చూసేందుకు ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మ్యాచ్ సందర్భంగా తెలంగాణ గురుకుల పాఠశాలల విద్యార్థులతో మెస్సీ ముచ్చటించారు. గురుకుల పాఠశాలల నుంచి వచ్చిన నాలుగు జూనియర్ టీమ్స్‌తో మాట్లాడిన మెస్సీ, వారికి ఫుట్‌బాల్ మెళకువలు అందించారు. మరోవైపు ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు. గోట్ ఇండియా టూర్ 2025లో భాగంగా లియోనాల్ మెస్సీ హైదరాబాద్ వచ్చారు. కలకత్తా నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న మెస్సీ.. అక్కడి నుంచి ఫలక్ నుమా ప్యాలెస్ చేరుకున్నారు. ఫలక్ నుమా ప్యాలెస్‌లో లియోనాల్ మెస్సీకి సీఎం రేవంత్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. ఆ తర్వాత ఫలక్ నుమా ప్యాలెస్‌లో నిర్వహించిన మీట్-అండ్-గ్రీట్ కార్యక్రమంలో లియోనాల్ మెస్సీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అక్కడి నుంచి ఉప్పల్ స్టేడియానికి చేరుకుని మ్యాచ్‌లో పాల్నారు.






## హార్దిక్ పాండ్యా గర్ల్‌ఫ్రెండ్‌ను వల్గర్‌గా వీడియోలు తీసి





టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన గర్ల్‌ఫ్రెండ్ మహీకా శర్మను పాపరాజీలు అసభ్యకరమైన కోణంలో చిత్రీకరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. బాంద్రా రెస్టారెంట్‌లో జరిగిన ఈ ఘటనపై సోషల్ మీడియాలో స్పందిస్తూ మహిళల గౌరవం, వ్యక్తిగత హద్దులను గౌరవించాలని మీడియాను కోరాడు. ఇది ప్రాథమిక గౌరవానికి సంబంధించిన విషయమని, ప్రతి మహిళకు గౌరవం అవసరమని హార్దిక్ నొక్కి చెప్పాడు. హార్దిక్ తన పుట్టినరోజున మహీకాతో రిలేషన్‌ను ప్రపంచానికి చాటి చెప్పాడు. టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశాడు. ముంబైలోని బాంద్రాలో ఓ రెస్టారెంట్‌కు వెళ్లిన సమయంలో హర్దిక్ పాండ్యా గర్ల్‌ఫ్రెండ్ మహీకా శర్మను పాపరాజీలు అసభ్యకరమైన కోణంలో వీడియో తీయడంతో హార్దిక్‌ను తీవ్రంగా మండిపడ్డాడు. ఈ ఘటనపై హార్దిక్ సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. “మనమంతా పబ్లిక్ లైఫ్‌లో ఉంటాం. దాంతో వచ్చే అటెన్షన్, స్క్రూటినీ అన్నీ ఓకే. కానీ ఈరోజు జరిగింది అసలు కరెక్ట్ కాదు. బాంద్రాలోని రెస్టారెంట్‌లో మెట్లు దిగుతూ వస్తుండగా, మహీకాను పాపరాజీలు ఎలాంటి స్త్రీని అయినా ఫోటో తీయకూడని కోణంలో షూట్ చేశారు. ఒక సాధారణ మోమెంట్‌ను చీప్ సెన్సేషనలిజంగా మార్చేశారు” అంటూ హార్దిక్ పాపరాజీలపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. “ఇది హెడ్‌లైన్స్ గురించో, ఎవరెం షూట్ చేశారో గురించో కాదు.. ఇది బేసిక్ రెస్పెక్ట్ విషయం. ప్రతి మహిళకీ గౌరవం అవసరం. ప్రతి ఒక్కరికీ బౌండరీలు కావాలి. మీడియా సోదరులు మీరు ఎంతో కష్టపడుతున్నారని నాకు తెలుసు. నేను ఎప్పుడూ సహకరిస్తాను. కానీ దయచేసి కొంచెం జాగ్రత్త. ప్రతి యాంగిల్ షూట్ చేయాల్సిన అవసరం లేదు. కొంత హ్యూమానిటీ ఉంచుకుందాం” అని పాండ్యా ఎమోషనల్ అయ్యాడు. మోడల్ - యోగా ట్రైనర్ అయిన మహీకా శర్మతో తన కొత్త రిలేషన్‌షిప్‌ను హార్దిక్ ఇటీవలే అధికారికంగా వెల్లడించాడు. ఈ ఏడాది అక్టోబర్‌లో తన 32వ పుట్టినరోజుకు ముందు, ఇద్దరూ కలిసి బీచ్ వద్ద గడిపిన ప్రైవేట్ ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ ఈ రిలేషన్‌ను కన్ఫార్మ్ చేశాడు. 24 ఏళ్ల మహీక ఓ మోడల్‌గా చేస్తోంది. చదువులో ఎకనామిక్స్, ఫైనాన్స్‌లో డిగ్రీ పూర్తి చేసింది. వారి మధ్యలో ఎంగేజ్‌మెంట్ రూమర్స్ కూడా వచ్చాయి. అయితే మహీకా వాటిని ఖండిస్తూ “రోజూ మంచి జ్యువెలరీ వేసుకుంటాను.. అది కూడా అంతే” అంటూ నవ్వుతూ క్లారిటీ ఇచ్చింది. హార్దిక్ గతంలో మహీకాను తన జీవితంలో మూడు ప్రాధాన్యాల్లో ఒకటిగా పేర్కొన్నాడు. క్రికెట్, తన కుమారుడు అగస్త్య, ఆ తర్వాత మహీకా అంటూ ఆమెకు తన జీవితంలో గొప్ప స్థానాన్ని ఇచ్చాడు. దాంతో పాపరాజీలు చేసిన పనికి చాలా ఆగ్రహం వ్యక్తం చేశాడు.

## నేడు ఫస్ట్ టీ20..




భారత్ - దక్షిణాఫ్రికా టీ - 20 సిరీస్ నేటి నుంచి మొదలవుతోంది. వరల్డ్ నంబర్ 1 టీమ్‌గా ఉన్న భారత్.. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో పటిష్టంగా ఉంది. అయితే, ఓపెనర్‌గా రాణిస్తున్న సంజు శాంసన్‌కు గిల్, జితేశ్ శర్మల రూపంలో గట్టి పోటీ ఎదురవుతోంది. టీ 20 వరల్డ్ కప్ నేపథ్యంలో సంజు కెరీర్ ప్రశ్నార్థకంగా మారింది. తొలి టీ20లో జితేశ్ శర్మను జట్టులోకి తీసుకుని సంజుని పక్కనబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా ఇప్పుడు ప్రపంచంలోనే నెంబర్ 1 టీ20 టీమ్‌గా ఉంది. వరల్డ్ నెంబర్ వన్ టీ20 బ్యాటర్ అభిషేక్ శర్మతో పాటు తిలక్ వర్మ కూడా రాణిస్తుండటంతో భారత్ బ్యాటింగ్‌లో పరుగుల వరద పారిస్తోంది. ఇక బౌలింగ్ విషయానికి వస్తే బుమ్రాతో పాటు వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ లాంటి బౌలర్లతో స్ట్రాంగ్‌గా ఉంది. ఆల్‌రౌండర్లలో హార్దిక్ పాండ్యా తిరిగి రావడం టీమిండియా పెద్ద బూస్ట్. శివమ్ దుబే, అక్షర్ పటేల్ రూపంలో మరో ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉన్నారు. అయితే, ఇప్పుడు గౌతమ్ గంభీర్‌కి టీమ్ సెలెక్షన్ విషయంలో సంజు శాంసన్ రూపంలో పెద్ద తలనొప్పి వచ్చి పడింది. టీ20 వరల్డ్ కప్ అనంతరం రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో ఆ తర్వాత నుంచి సంజు శాంసన్ ఓపెనర్‌గా రాణించాడు. ఏడాది కాలంలోనే ఓపెనర్‌గా దిగి ఏకంగా మూడు సెంచరీలు నమోదు చేశాడు. బ్యాక్ టు బ్యాక్ సెంచరీలతో తన సత్తా ఏంటో చూయించాడు. గిల్ జట్టులోకి తిరిగి రావడంతో సంజుకి కష్టాలు మొదలయ్యాయి. గిల్‌ని ఓపెనర్ స్థానంలోనే గంభీర్ ప్రమోట్ చేస్తుండగా.. సంజుని మిడిలార్డర్, అంతకంటే దిగువ స్థానాల్లో బ్యాటింగ్ చేయిస్తున్నాడు. ఓపెనర్‌గా సక్సెస్ అయిన సంజు.. మిడిలార్డర్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నాడు. దాంతో వికెట్ కీపర్‌గా సంజుని పక్కనబెట్టి ఆస్ట్రేలియా టూర్‌లో జితేశ్ శర్మకి అవకాశం ఇచ్చారు. సౌతాఫ్రికా సిరీస్‌లోనూ జితేశ్ శర్మనే కొనసాగే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. సక్సెస్‌ఫుల్‌గా దూసుకెళ్తున్న సంజు శాంసన్ కెరీర్‌లో గిల్, జితేశ్ ఎంట్రీ పెద్ద మైనస్‌గా మారింది. ఓపెనింగ్ స్థానంలో గిల్ ఎసరు పెడితే, లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేస్తూ జితేశ్ జట్టులో ప్లేస్ ఫిక్స్ చేసుకునే పనిలో పడ్డాడు. ఇంకో రెండు మూడు నెలల్లో టీ20 వరల్డ్ కప్ ఉండటంతో సంజు శాంసన్ కెరీర్ ప్రశ్నార్థకంగా మారింది.

## రోహిత్-కోహ్లీని ఆకాశానికి ఎత్తిన షాహిద్ అఫ్రిది!

# గంభీర్‌ను ఏకిపారేసి..



పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహీద్ అఫ్రిది, టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై మరోసారి విమర్శలు గుప్పించాడు. రోహిత్ శర్మ - విరాట్ కోహ్లీలను 2027 వరల్డ్ కప్ వరకు భారత జట్టుకు వెన్నెముకగా అభివర్ణించాడు. వీరిని కాదని, కొత్త ఆటగాళ్లను పరీక్షించడం అనవసరమని, బలహీనమైన జట్లతో మ్యాచ్‌లలోనే వారికి విశ్రాంతి ఇవ్వాలని సూచించారు. గంభీర్ కోచ్‌గా తన అభిప్రాయాలే సరైనవని భావించాడని, కానీ అది తప్పని తెలుసుకున్నాడని ఎద్దేవా చేశాడు. పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహీద్ అఫ్రిది మరోసారి గౌతమ్ గంభీర్‌పై ఫైర్ అయ్యాడు. ఆన్ ది ఫీల్డ్ ఈ ఇద్దరు ఆటగాళ్లు నువ్వా - నేనా అన్నట్టు ఒకళ్లకి ఒకళ్లు తగ్గకుండా ఉండేవాళ్లు.



తాజాగా టీమిండియాలో జరుగుతున్న ఇన్సిడెంట్లపై షాహీద్ అఫ్రిది హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను ఏకిపారేశాడు. అదే సమయంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిని ఆకాశానికి ఎత్తేశాడు. ఈ లెజెండ్స్‌ను బయటకు నెట్టే ప్రయత్నాలు అనవసరమని, 2027 వరల్డ్ కప్ వరకు భారత్‌కు ప్రధాన బలం అని అఫ్రిది అన్నాడు. “విరాట్, రోహిత్.. ఈ ఇద్దరూ ఇండియా బ్యాటింగ్‌కు ప్రధాన వెన్నెముక. తాజాగా ఆడిన వన్డే సిరీస్ చూస్తే, వీళ్లు ఇంకా మూడు, నాలుగు సంవత్సరాలు ఈలీగ్‌లో సులభంగా కొనసాగుతారు. ఈ ఇద్దరు స్టార్లను ప్రొటెక్ట్ చేయాలి. బలహీనమైన జట్లతో మ్యాచ్‌లు ఉన్నప్పుడు కొత్త ప్లేయర్లను పరీక్షించండి. ఆ సమయంలో మాత్రం విరాట్ - రోహిత్‌కు రెస్ట్ ఇవ్వొచ్చు” అని అఫ్రిది టెలికాం ఆసియా స్పోర్ట్స్‌కు చెప్పాడు. కెరీర్‌లో ఎన్నోసార్లు ఆన్-ఫీల్డ్ క్లాషలు జరిగిన గౌతమ్ గంభీర్‌పై అఫ్రిది మరోసారి ఫైర్ అయ్యాడు. “గంభీర్ కోచ్‌గా వచ్చినప్పుడు, అతను అనుకునేదంతా సరైనదే అనుకున్నాడు. కానీ కొద్దికాలంలోనే తెలుసుకున్నాడు. ఎప్పుడూ నువ్వు చెప్పిందే కరెక్ట్ కాదని” అంటూ ఆఫ్రిది వ్యాఖ్యానించాడు. రోహిత్ శర్మ తన వన్డే సిక్సుల రికార్డ్ (351)ని బ్రేక్ చేయడంపై అఫ్రిది హర్షం వ్యక్తం చేశాడు. “రికార్డ్స్ బ్రేక్ కావడానికి నే ఉంటాయి. నేను ఇష్టపడే ఆటగాడు ఈ రికార్డ్ బ్రేక్ చేయడం చూసి సంతోషంగా ఉంది” అని అన్నాడు. అఫ్రిది వన్డేల్లో 351 సిక్స్‌లతో టాప్‌లో ఉండగా, రాయపూర్ వన్డేలో రోహిత్ 355 సిక్స్‌లు కొట్టి అతడిని దాటేశాడు. 2008 ఐపీఎల్‌లో తమిద్దరూ దక్కన ఛార్జర్స్ తరఫున ఆడిన రోజుల్ని అఫ్రిది గుర్తుచేసుకున్నాడు. “అప్పుడే రోహిత్ బ్యాటింగ్ క్లాస్ నాకు కనిపించింది. నెట్ సెషన్‌లో అతని షాట్స్ చూశాక ‘ఈ ఆటగాడు తప్పకుండా ఇండియా కోసం పెద్ద ఆటగాడవుతాడు’ అని అర్థమైంది” అని అఫ్రిది చెప్పాడు.

## ఐపీఎల్ 2026 మినీ వేలం నుంచి 1040 మంది ప్లేయర్లు ఔట్..



ఐపీఎల్ 2026 మినీ వేలంపై ఆసక్తికరమైన ట్విస్ట్‌లు! 1390 మందిలో కేవలం 350 మందికే బీసీసీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. క్వింటన్ డి కాక్ వంటి సర్‌ప్రైజ్ ఎంట్రీలు, కొత్త విదేశీ, భారతీయ ఆటగాళ్ల జాబితా అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. డిసెంబర్ 16న అబుదాబిలో వేలం మొదలుకానుంది. ఆటగాళ్ల కేటగిరీల వారీగా వేలం ప్రక్రియ సాగనుంది. కొత్తగా లిస్టులో చేరిన విదేశీ ఆటగాళ్లలో దక్షిణాఫ్రికా, శ్రీలంక దేశానికి చెందిన ప్లేయర్లే ఎక్కువ మంది ఉన్నారు. ఐపీఎల్ 2026 మినీ వేలం దగ్గరపడుతున్న కొద్ది కొత్త కొత్త ట్విస్ట్‌లు వస్తున్నాయి. రిటెన్షన్, రిలీజ్ సమయంలో సంజు శాంసన్ - రవీంద్ర జడేజా, శామ్ కరన్ డీల్ ఐపీఎల్ బిగ్గెస్ట్ డీల్‌గా నిలిచి అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఇక మరికొద్ది రోజుల్లో మినీ వేలం మొదలవుతుంది అనగా.. వేలానికి వచ్చి 1390 మంది ప్లేయర్లలో 1040 మందిని తొలగిస్తూ బీసీసీఐ షాక్ ఇచ్చింది. రిజెక్ట్ అయిన ప్లేయర్లలో పెద్ద పెద్ద ఆటగాళ్లు కూడా ఉండటం విశేషం. తుది జాబితాలో 35 మంది సర్‌ప్రైజ్ ఎంట్రీలు కూడా ఉండటం ఆసక్తికరంగా మారింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 మినీ వేలం కోసం పంపిన తొలి లిస్టులో 1,390 ప్లేయర్లున్నారు. అయితే ఫ్రాంచైజీలతో జరిగిన పలుమార్లు చర్చలు, మార్పుల తర్వాత బీసీసీఐ చివరకు ఆ జాబితాను భారీగా తగ్గించి 350 పేర్లతో ఫైనల్ లిస్టు విడుదల చేసింది. అంటే దాదాపు 75 శాతం తగ్గింపు. మినీ వేలం డిసెంబర్ 16న అబుదాబి ఎతిహాద్ అరేనాలో భారత కాలమాన ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభం కానుంది. 350 మంది తుది జాబితాలో అత్యంత ఆశ్చర్యకరమైన పేరు క్వింటన్ డి కాక్. తొలి జాబితో ఆయన పేరు లేకపోయినా, ఒక ఫ్రాంచైజీ నేరుగా అభ్యర్థించడంతో కీపర్-బాటర్‌ల మూడో లాట్‌లో డికాక్ పేరు చేర్చారు. ఇటీవల అంతర్జాతీయ రిటైర్మెంట్ నుంచి తిరిగి వచ్చిన డి కాక్ విశాఖపట్నంలో సెంచరీ బాదడంతో మళ్లీ ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టిని ఆకర్షించాడు. ఈసారి డికాక్ బేస్ ప్రైస్ రూ.1 కోటి. గత మెగా వేలంలో రూ. 2 కోట్ల బేస్ ప్రైస్‌తో ఉన్న సంగతి తెలిసిందే. ఈసారి లిస్టులోకి కొత్తగా చేరిన విదేశీ ప్లేయర్లు ఎవరంటే.. అరబ్ గుల్ (అఫ్ఘనిస్తాన్), మైల్స్ హామండ్ (ఇంగ్లండ్), డాన్ లాటేగన్ (ఇంగ్లండ్), క్వింటన్ డి కాక్ (దక్షిణాఫ్రికా), కానర్ ఎజ్‌థర్‌హుయ్జెన్ (దక్షిణాఫ్రికా), జార్జ్ లిండే (దక్షిణాఫ్రికా), బాయండా మజోలా (దక్షిణాఫ్రికా), ట్రావీన్ మాథ్యూ (శ్రీలంక), బినుర ఫెర్నాండో (శ్రీలంక), కుశాల్ పెరేరా (శ్రీలంక), దునిత్ వెల్లాలాగే (శ్రీలంక), ఆఖీమ్ అగస్టే (వెస్టిండీస్). భారతీయ ప్లేయర్ల విభాగంలో కూడా అనేక ఆశ్చర్యకరమైన పేర్లు చేరాయి. సాదెక్ హుస్సేన్, విష్ణు సోలంకి, సబీర్ ఖాన్, బ్రిజేశ్ శర్మ, కనిష్క్ చౌహన్, ఆరోన్ జార్జ్, జిక్కు బ్రైట్, శ్రీహరి నాయర్, మాధవ్ బజాజ్, శ్రీవత్స ఆచార్య, యశ్‌రాజ్ పుంజా, సహిల్ పరాఖ్, రోషన్ వాఘ్‌సారే, యష్ దిచోల్కర్, అయాజ్ ఖాన్, ధుర్మిల్ మట్కర్, నమన్ పుష్పక్, పరిక్షిత్ వాల్సంగ్కర్, పురవ్ అగర్వాల్, రిషభ్ చౌహన్, సాగర్ సోలంకి, ఇజాజ్ సవారియా, అమన షెకావత్. మొదట క్యాప్డ్ ప్లేయర్లు- బ్యాటర్లు, ఆల్‌రౌండర్లు, కీపర్-బాటర్లు, ఫాస్ట్ బౌలర్లు, స్పిన్నర్లు అనే కేటగిరీల్లో వేలం ప్రక్రియ జరుగుతుంది. తర్వాత అన్‌క్యాప్డ్ ప్లేయర్లు ఇదే క్రమంలో బిడ్‌కు వస్తారు బ్యాటర్ మొదటి బ్యాచ్‌లో కామెరూన్ గ్రీన్, డెవాన్ కాన్వే, ఫ్రేజర్ మెక్ గర్క్, పృథ్వీ షా, డేవిడ్ మిల్లర్ పేర్లు ఉన్నాయి. ఆల్‌రౌండర్లలో వెంకటేశ్ అయ్యర్ ఉన్నాడు. 70వ ప్లేయర్ తర్వాత వేలం వేగం పెరుగుతుంది. 71 నుంచి 350 వరకు ప్లేయర్లు మొదటి యాక్సిలరేటెడ్ లైన్‌లో ఉంటారు. అనంతరం అమ్ముడుపోని లేదా ఇంకా ప్రెజెంట్ చేయని పేర్లను ఫ్రాంచైజీలు సజెస్ట్ చేసే అవకాశం ఉంటుంది.




# ‘అఖండ 2’ ఎఫెక్ట్‌తో చిన్న సినిమాలు వాయిదా..



బాలకృష్ణ%–%బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కిన ‘అఖండ 2’ డిసెంబర్ 12న విడుదలకు అడ్డంకులు తొలగినట్టు తెలుస్తోంది. మొదట డిసెంబర్ 5కు ప్లాన్ చేసిన ఈ సినిమా ఫైనాన్స్ కారణాలతో వాయిదా పడగా, ఇప్పుడు అదే తేదీని ఫైనల్ చేయనున్నారు. దీని ప్రభావంతో చిన్న సినిమాలు అయోమయంలో పడ్డాయి. డిసెంబర్ 12కు షెడ్యూల్ అయిన రోషన్ కనకాల హీరోగా సందీప్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘మోగ్లీ’ 2026 ఫిబ్రవరిలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిస్థితిపై సందీప్ రాజ్ భావోద్వేగ ట్వీట్ చేయడం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. నందమూరి బాలకృష్ణ హీరోగా, బో–యపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘ అఖండ 2 ’ థియేటర్లలోకి రావడానికి అడ్డంకులు తొలగినట్టే కనిపిస్తోంది. వాస్తవానికి ఈ సినిమా డిసెంబర్ 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కావాల్సి ఉండగా, ఫైనాన్స్‌కు సంబంధించిన కొన్ని ఇబ్బందుల కారణంగా చివరి నిమిషంలో వాయిదా పడింది. అప్పట్లో మేకర్స్ డిసెంబర్ 12కు సినిమాను వాయిదా వేయనున్నట్లు అంతర్గతంగా సమాచారం అందింది. ఇప్పుడు తాజా సమాచారంతో డిసెంబర్ 12న అఖండ 2 విడుదల దాదాపు ఫైనల్ అయిందని, మంగళవారమే అధికారిక ప్రకటన కూడా వచ్చే అవకాశముందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో బాలయ్య అభిమానుల్లో మళ్లీ ఉత్సాహం మొదలైంది. అయితే అఖండ 2 డిసెంబర్ 12కి షిఫ్ట్ అవుతుందన్న వార్త చిన్న సినిమాల నిర్మాతల్లో తీవ్ర అయోమయాన్ని తీసుకొచ్చింది. ఎందుకంటే మొదట అఖండ 2 డిసెంబర్ 5కు ప్రకటించడంతో అనేక చిన్న సినిమాలు తమ విడుదల తేదీలను డిసెంబర్ 12కు ఫిక్స్ చేసుకున్నాయి. 12వ తేదీన ఏకంగా 8 సినిమాలు రిలీజ్ కావాల్సి ఉంది. కానీ ఇప్పుడు అదే తేదీన బాలయ్య%–%బోయపాటి కాంబినేషన్ రాబోతుండటంతో, చిన్న సినిమాలు పోటీలో నిలవలేవన్న ఆందోళన మొదలైంది. దీంతో ఒకదాని తర్వాత ఒకటి వెనక్కి తగ్గే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ క్రమంలో సుమ కనకాల కుమారుడు రోషన్ కనకాల హీరోగా, ‘కలర్ ఫోటో’ ఫేం సందీప్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘ మోగ్లీ ’ సినిమా కూడా వాయిదా పడే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. మొదట ఈ చిత్రాన్ని డిసెంబర్ 12న విడుదల చేయాలని మేకర్స్ పెద్ద ఎత్తున ప్రమోషన్లు నిర్వహించారు. పాటలు, ట్రైలర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు కూడా బాగానే ఏర్పడ్డాయి. కానీ అఖండ 2 అదే రోజున థియేటర్లలోకి వస్తే, మోగ్లీకి థియేటర్లు దొరకడం కష్టం అవుతుందన్న భయంతో నిర్మాతలు వెనక్కి తగ్గినట్టు తెలుస్తోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మోగ్లీని 2026 ఫిబ్రవరిలో విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారట. అయితే దీనిపై ఇప్పటివరకూ అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. ‘మోగ్లీ’ వాయిదా వార్తల నేపథ్యంలో దర్శకుడు సందీప్ రాజ్ చేసిన భావోద్వేగ ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ‘కలర్ ఫోటో’, ‘మోగ్లీ’ లాంటి సినిమాలకు నాకన్నా మరో డైరెక్టర్ ఉంటే బాగుండేదేమో అనిపిస్తోంది. అన్నీ బాగానే జరిగే సమయంలో రిలీజ్ విషయంలో దురదృష్టం ఎదురవుతోంది. ఇందులో కామన్ పాయింట్ నేనే. బహుశా నేనే బ్యాడ్ లక్ కావచ్చేమో’ అంటూ ఆయన తన మనోవేదనను పంచుకున్నారు. అలాగే ‘ దిరెక్టెద్ బై సందీప్ రాజ్ ’ అనే టైటిల్‌ను పెద్ద తెరపై చూడాలన్న తన కల రోజురోజుకీ కష్టమవుతోందని, అయినప్పటికీ మోగ్లీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికైనా మంచి జరగాలని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు. సందీప్‌రాజ్ దర్శకత్వం వహించిన ‘కలర్ ఫోటో’ కరోనా టైమ్‌లో థియేటర్లలో కాకుండా ఓటీటీలో రిలీజైంది. ఇప్పుడు ‘మోగ్లీ’ చిత్రానికి కూడా రిలీజ్ అడ్డంకులు ఎదురుకావడంతోనే సందీప్ రాజ్ ఇలా ఎమోషనల్ అయ్యారని నెటిజన్లు భావిస్తున్నారు. మోగ్లీ మాత్రమే కాదు%ొ% అదే రోజున విడుదల కావాల్సిన ‘ఈషా’ వంటి మరో చిన్న సినిమా కూడా వాయిదా పడినట్లు ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. మరోవైపు కార్తీ, కృతి శెట్టి జంటగా నటించిన ‘అన్నగారు వస్తారు’ సినిమా మాత్రం డిసెంబర్ 12కే విడుదలవుతుందా? లేక ఆ సినిమా కూడా వెనక్కి తగ్గుతుందా? అన్నది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. మొత్తంగా అఖండ 2 ప్రభావం మరోసారి ఇండస్ట్రీని షేక్ చేస్తోంది. పెద్ద సినిమాల విడుదలయ్యే ప్రతి సందర్భంలోనూ చిన్న సినిమాల పరిస్థితి ఎంత క్లిష్టంగా మారుతుందో ఈ పరిణామాలు మరోసారి గుర్తుచేస్తున్నాయి. ఇప్పుడు డిసెంబర్ 12న బాలయ్య ‘అఖండ’ పూనకాలు ఖాయమైతే, చిన్న సినిమాలు కొత్త తేదీల కోసం ఎదురుచూడక తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

# ‘నరసింహ’ సీక్వెల్‌పై రజినీకాంత్ క్రేజీ అప్‌డేట్...



సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన క్లాసిక్ మూవీ ‘పడయప్ప’ (తెలుగులో ‘నరసింహ’) 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 12న థియేటర్లలో రీ–రిలీజ్ కానుంది. రజనీకాంత్ పుట్టినరోజు సందర్భంగా 4కే డిజిటల్ ప్రింట్, డాల్బీ అట్మాస్ సౌండ్‌తో సినిమాను రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓ వీడియో ఇంటర్వ్యూలో రజనీ అనూహ్యంగా ‘పడయప్ప 2’ గురించి ప్రస్తావించారు. ఈ సీక్వెల్ నీలాంబరి పాత్ర చుట్టూనే ఉండొచ్చని ఆయన చెప్పడంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. రీ–రిలీజ్‌కు ఇది మరింత హైప్‌ను తెచ్చిందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సూపర్ స్టార్ రజనీకాంత్ కెరీర్‌లోనే కాదు, దక్షిణాది సినిమా చరిత్రలో నిలిచిపోయిన అద్భుత మైలురాళ్లలో ‘పడయప్ప’ (తెలుగులో ‘ నరసింహ ’) సినిమా ఒకటి. 1999లో విడుదలైన ఈ చిత్రం సంచలన విజయాన్ని నమోదు చేసి, రజనీకాంత్ మాస్ ఇమేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు ఈ క్లాసిక్ మూవీ విడుదలై 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, అలాగే రజనీకాంత్ పుట్టినరోజు కానుకగా డిసెంబర్ 12న ‘నరసింహ’ను ప్రపంచవ్యాప్తంగా మళ్లీ థియేటర్లలో రీ–రిలీజ్ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈసారి 4ఖ డిజిటల్ ప్రింట్, డాల్బీ అట్మాస్ సౌండ్‌తో సినిమాను విడుదల చేయనుండటం విశేషం. దీంతో విజువల్, సౌండ్ అనుభూతి పూర్తిగా కొత్త లెవల్‌లో ఉండనుందని అభిమానులు భావిస్తున్నారు. కొత్త సినిమా విడుదలకు ఏమాత్రం తీసిపోకుండా, ‘నరసింహ’ రీ–రిలీజ్‌ను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ చిత్రం ఏ డిజిటల్ ప్లాట్‌ఫామ్ లోనూ అందుబాటులో లేకపోవటంతో పెద్ద తెరపై మళ్లీ ఈ క్లాసిక్‌ను చూడాలని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రజనీ స్టైల్ డైలాగ్స్, మాస్ ఎంట్రీలు, భావోద్వేగ సన్నివేశాలు, పవర్‌ఫుల్ క్లైమాక్స్ అన్నీ కలసి మరోసారి థియేటర్లలో పండగ వాతావరణాన్ని సృష్టించనున్నాయి. ఈ రీ–రిలీజ్ సందర్భంగా రజనీకాంత్ ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూ ఇప్పుడు తమిళ సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ ఇంటర్వ్యూలో ఆయన అనూహ్యంగా ‘పడయప్ప 2’ (నరసింహ 2) గురించి ప్రస్తావించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ సినిమాకు సీక్వెల్ తీసే అవకాశం ఉందని, అయితే అది తనకంటే ఎక్కువగా రమ్యకృష్ణ పోషించిన నీలాంబరి పాత్ర చుట్టూనే కేంద్రీకృతమై ఉంటుందని ఆయన చెప్పడం సంచలనంగా మారింది. నీలాంబరి పాత్ర గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. రమ్యకృష్ణ చేసిన ఆ నెగటివ్ షేడ్ పాత్ర తమిళ–తెలుగు సినీ చరిత్రలోనే ఓ ఐకానిక్ విలన్ పాత్రగా నిలిచిపోయింది. ఆమె నటన, హావభావాలు, డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. అయితే మొదటి భాగంలో నీలాంబరి పాత్ర చనిపోతుంది. అలాంటప్పుడు సీక్వెల్‌లో ఆ పాత్ర ఎలా తిరిగి వస్తుంది? ఇది ఫ్లాష్‌బ్యాక్ ఆధారిత కథనా? లేక కొత్త కోణంలో కథను మలుస్తారా? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ఇక ఈ సీక్వెల్ విషయంలో దర్శకుడెవరు అనే అంశం కూడా ఆసక్తికరంగా మారింది. ‘పడయప్ప’ను తెరకెక్కించిన దర్శకుడు కె.ఎస్. రవికుమార్ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉన్నారు. అలాంటి ఒక క్లాసిక్ సీక్వెల్‌ను హ్యాండిల్ చేసే దర్శకుడిని ఎంపిక చేయడం చాలా కీలకమని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అందుకే రజనీకాంత్ చేసిన ఈ ప్రకటన నిజంగా సీక్వెల్‌కు సంబంధించినదా? లేక రీ–రిలీజ్‌కు హైప్ తీసుకొచ్చే భాగమా? అనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఈ వార్త తెలిసిన వెంటనే నెటిజన్లు పోస్టర్లు క్రియేట్ చేస్తూ హంగామా చేస్తున్నారు. ఏది ఏమైనా, డిసెంబర్ 12న ‘నరసింహ’ థియేటర్లలో రీ–రిలీజ్ కావడం మాత్రం ఖాయం.

# ఆ ఒక్క ఈవెంట్‌తో 400 కోట్లు ఎక్కువ వచ్చాయి



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన ‘పుష్ప 2: ది రూల్’ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.1870 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఇండియన్ సినిమా ఇండస్ట్రీ రికార్డ్ సృష్టించింది. ఈ అద్భుత విజయం వెనుక నార్త్ లో నిర్వహించిన ప్రమోషనల్ ఈవెంట్ కీలక పాత్ర పోషించిందని నిర్మాత వై. రవి శంకర్ తెలిపారు. ముఖ్యంగా బీహార్ లో నిర్వహించిన ఈవెంట్ ఐడియా ‘చాయ్ బిస్కెట్’ సంస్థ నుంచే వచ్చిందని, దీనివల్ల హిందీలో రూ.300–400 కోట్ల నెట్ అదనంగా వచ్చిందని ఆయన వెల్లడించారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ బండ్రెడ్డి దర్శకత్వంలో వచ్చిన సినిమా ‘పుష్ప’. ‘పుష్ప: ది రైజ్’ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విజయం సాధించగా.. ‘పుష్ప 2: ది రూల్’ ఏకంగా ఇండియన్ సినిమా ఇండస్ట్రీ రికార్డ్ క్రియేట్ చేసింది. ప్రపంచ వ్యాప్తంగా రూ.1870 కోట్లకి పైగా కలెక్షన్స్ సాధించింది. ఒక్క హిందీలోనే రూ.800 కోట్లకు పైగా గ్రాస్ వసూలు రాబట్టింది. హిందీలో అత్యధిక కలెక్షన్స్ అందుకున్న చిత్రంగా సంచలనం సృష్టించింది. ఈ రేంజ్ లో వసూళ్లు దీనికి నార్త్ లో నిర్వహించిన ఓ ప్రమోషనల్ ఈవెంట్ కారణమని నిర్మాత వై. రవి శంకర్ అభిప్రాయపడ్డారు. ‘పుష్ప: ది రైజ్’, ‘పుష్ప 2: ది రూల్’ చిత్రాలను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మించిన సంగతి తెలిసిందే. ‘చాయ్ షాట్స్’ గ్రాండ్ లాంచ్ ఈవెంట్ కి నిర్మాత రవి శంకర్ గెస్టుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ‘చాయ్ షాట్స్’ లాంచ్ ని తమ మైత్రి మూవీ మేకర్స్ లాంచ్ లాగే ఫీల్ అవుతున్నానని అన్నారు. మైత్రీ కంపెనీ ఈ స్థాయిలో ఉండటానికి చాయ్ బిస్కెట్ శరత్, అనురాగ్ కూడా కారణమని, పిల్లర్స్ లా పని చేశారని.. క్రియేటివ్ సైడ్, సోషల్ మీడియా ప్రచారం విషయంలో ఎంతో సపోర్ట్ చేశారని తెలిపారు. “మైత్రీ, చాయ్ బిస్కెట్ సంస్థలు రెండూ ఒకేసారి మొదలయ్యాయి. అప్పటి నుంచే శరత్, అనురాగ్ నాకు తెలుసు. నేను అందుబాటులో లేకపోతే శరత్, అనురాగ్ ఎలాంటి కాల్ అయినా తీసుకోవచ్చని నేను మా కంపెనీలో ఇన్స్ట్రక్షన్ ఇచ్చాను. వాళ్లకి అంత ఫ్రీడమ్ ఉంది. వారి అచీవ్మెంట్స్ చూస్తుంటే నాకు చాలా హ్యాపీగా ఉంది. ‘చాయ్ షాట్స్’ కచ్చితంగా చాలా గొప్ప స్థాయికి వెళ్తుందని నమ్మకం ఉంది. వేల కోట్లకి ఎదిగే పొటెన్షియల్ ఉందని నమ్ముతున్నాను. మైత్రీ మూవీ మేకర్స్ లో మేము డిఫరెంట్ కంటెంట్ ని చేసాం. కానీ ఇప్పుడు రోజురోజుకీ ట్రెండు మారిపోతుంది. చాయ్ షాట్స్ ఆలోచన చూస్తుంటే మేము కూడా వాళ్లతో కొలాబరేట్ అవ్వాలని ఉంది. ఇందులో క్రియేటర్స్ యాక్టర్స్ అందరూ బిగ్ స్క్రీన్ మీదకి రావాలని కూడా కోరుకుంటున్నాను. తప్పకుండా మా సపోర్ట్ ఉంటుంది” అని రవి శంకర్ అన్నారు. “మైత్రీ మూవీస్ అచీవ్ మెంట్ లో అనురాగ్, శరత్ హార్డ్ వర్క్ ఎంతో ఉంది. ఎన్నో క్రియేటివ్ ఐడియాస్ ఇచ్చారు. ‘పుష్ప 2’ సినిమాని ప్రమోట్ చేయడానికి, ఎలా మార్కెటింగ్ చేయాలనే దాని గురించి పెద్ద పెద్ద మీటింగ్స్ జరిగాయి. ఇండియాలో ఉన్న ఎన్నో పెద్ద కంపెనీలని పిలిచాం. చివరకి చాయ్ బిస్కెట్ వాళ్లు ఇచ్చిన ఐడియాలే ఇంప్లిమెంట్ అయ్యాయి. బీహార్ లో ఈవెంట్ చేయాలనే కోర్ ఐడియా వాళ్ల నుంచే వచ్చింది. ఆ ఈవెంట్ వల్ల హిందీలో రూ.300 – 400 కోట్ల నెట్ ఎక్కువగా వచ్చింది” అని మైత్రీ రవి శంకర్ చెప్పుకొచ్చారు.

# స్మృతి బాటలోనే నివేదా పేతురాజ్...



తెలుగు, తమిళ చిత్రాల్లో గుర్తింపు పొందిన నటి నివేదా పేతురాజ్ వ్యక్తిగత జీవితం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఏడాది ఆగస్టులో దుబాయ్ బిజినెస్‌మ్యాన్ రాజ్‌హిత్ ఇబ్రాన్‌తో ఆమె ఎంగేజ్‌మెంట్ జరగగా, ఏడాది చివర్లో పెళ్లి ఉంటుందనే ప్రచారం సాగింది. అయితే తాజాగా నివేదా సోషల్ మీడియాలో రాజ్‌హిత్‌తో ఉన్న ఫొటోలు డిలీట్ చేయడంతో బ్రేకప్ వార్తలు వైరల్ అయ్యాయి. అదే సమయంలో రాజ్‌హిత్ మరో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడనే ప్రచారం నెట్టింట చర్చకు దారి తీసింది. తెలుగు, తమిళ చిత్రాల్లో తనదైన గుర్తింపు సంపాదించుకున్న నటి నివేదా పేతురాజ్ ఆకట్టుకునే పాత్రలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం దక్కించుకుంది. 2016లో తమిళ చిత్రం ‘ఒరు నాళ్ కోత్తు’తో సినీ రంగ ప్రవేశం చేసిన నివేదా, ఆ తర్వాత వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో శ్రీ విష్ణు సరసన నటించిన ‘మెంటల్ మదిలో’తో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు. ఆ సినిమా తెచ్చిన గుర్తింపుతో ‘అల వైకుంఠపురములో’, ‘రెడ్’, ‘దాస్ కా ధమ్కీ’ వంటి చిత్రాల్లో నటిస్తూ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లారు. అలాగే ‘భూ’ అనే హారర్ థ్రిల్లర్ సినిమా, ‘పరువు’ వెబ్ సిరీస్‌లో కూడా ఆమె కనిపించారు. సినిమాలతో పాటు కార్ రేసింగ్, ఫార్ములా వన్‌పై ఉన్న ఆసక్తితోనూ నివేదా తరచూ వార్తల్లో నిలిచారు. ఇటీవల నివేదా వ్యక్తిగత జీవితం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఏడాది ఆగస్టులో దుబాయ్‌లో స్థిరపడిన బిజినెస్‌మ్యాన్ రాజ్‌హిత్ ఇబ్రాన్తో ఆమె ఎంగేజ్‌మెంట్ జరిగిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని మొదట చాలా గోప్యంగా ఉంచిన నివేదా, ఆ తర్వాత సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఈ ఏడాది చివర్లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వివాహం జరగనున్నట్లు వార్తలు కూడా వినిపించాయి. అయితే తాజాగా ఈ వ్యవహారం ఊహించని మలుపు తిరిగినట్లు నెటిజన్లు చర్చించుకుంటున్నారు. అనూహ్యంగా నివేదా తన సోషల్ మీడియా ఖాతా నుంచి రాజ్‌హిత్ ఇబ్రాన్‌తో ఉన్న ఫొటోలన్నింటినీ డిలీట్ చేయడంతో బ్రేకప్ వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. అదే సమయంలో రాజ్‌హిత్ ఇబ్రాన్ మరో యువతితో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. దీనిపై నివేదా ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. ఈ మౌనం మరింత అనుమానాలకు దారితీస్తుండటంతో, నెటిజన్లు “దాల్ మే కుచ్ కాలా హై” అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ పరిణామం మరింత ఆసక్తికరంగా మారడానికి కారణం ఇటీవలే క్రికెటర్ స్మృతి మంధానా పెళ్లి చివరి నిమిషంలో రద్దయ్యిందనే వార్తలు వైరల్ కావడమే. అదే సమయంలో నివేదా పేతురాజ్ ఎంగేజ్‌మెంట్ కూడా బ్రేక్ అయిందనే ప్రచారం రావడంతో, “ఇది కూడా అలాంటి సంఘటనేనా?” అంటూ నెటిజన్లు పోలుస్తున్నారు. ఇద్దరు సెలబ్రిటీలు ఒకే సమయంలో వ్యక్తిగత జీవితంలో ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొనడం యాదృచ్ఛికమే అయినా, సోషల్ మీడియాలో మాత్రం దీనిపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. నివేదా పేతురాజ్ సినిమాలకు కొంతకాలంగా దూరంగా ఉండటంతో, ఆమె వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇస్తోందని అంతా భావించారు.

Printed, Published, Edited and Owned by Darsanam Chinnaiah Printed at Gk Printers Old Town Kurnool district Andhra Pradesh Published From D-No- 7-37-106/1 Old Sundipenta Srisailam Project Nandyal district Andhra Pradesh, "RNI/AP/TEL 16361/2023(TC) Email:adhunikandhra@gmail.com, Mobile: 9492611573.